## పామూరులో సందడి చేస్తున్న
# బులెట్‌బాబు చిత్ర యూనిట్ బృందం





### - తొలిషాట్‌కు క్లాప్ కొట్టిన వైసీపీ శ్రేణులు

**పామూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**

చిన్మయి క్రియేషన్స్ వారి డైరెక్టర్ సుభాష్‌బాబు, నిర్మాత వి.వెంకటేశ్వరరెడ్డి సారథ్యంలో నూతన నటీనటులతో నిర్మితమవుతున్న బులెట్‌బాబు చిత్రానికి సంబంధించి తొలిషాట్‌ను పామూరులోని శివాలయంలో వైసీపీ శ్రేణులు జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు,మండల బూత్ కమిటీ అధ్యక్షులు గట్ల విజయభాస్కర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త జొన్నలగడ్డ గోవిందయ్య తదితరులు తొలిక్లాప్ అందించగా ముహూర్తపు సన్నివేశాన్ని చిత్రీకరించారు. హీరోగా నెల్లూరుకు చెందిన శివ ప్రసాద్, హీరోయిన్‌గా రిషిత, వర్షిత,చిత్రంలో కీలకరోల్ పోషిస్తున్న బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మెంబరు కొల్లూరు రవికిరణ్‌శర్మ, శ్రీలత, కెమెరామెన్ వాసు వర్మ తదితరులు ముహూర్తపు సన్నివేశంలో వీక్షకుల నడుమ చిత్రీకరించారు. పది రోజులు పాటు పామూరు మండలంలోని బొట్లగూడూరు, బోడవాడ తదితర గ్రామాల్లో బులెట్‌బాబు నూతన చిత్రాన్ని చిత్రీకరిస్తున్నట్లు అందుకు పామూరు మండలంలోని ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అవసరమని డైరెక్టర్ సుభాష్‌బాబు తెలిపారు. తనకు ఇది రెండో సినిమా అని, సీనియర్ దర్శకులు ముత్యాల సుబ్బయ్య, ముప్పల నేని శివ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి ఇది రెండో చిత్రంగా తెరకెక్కిస్తున్నట్లు సుభాష్ తెలిపారు. గ్రామీణ ప్రాంత నేపథ్యంలో కొనసాగే వినోదాత్మకమైన ప్రేమ, సెంటిమెంట్ తో కూడిన చిత్రంగా ఇది ప్రేక్షకులను రంజింపచేస్తుందని డైరెక్టర్ సుభాష్ బాబు తెలిపారు. పూర్తిగా పల్లెటూరు వాతావరణంలోనిర్మించే ఈ సినిమాకు మూడు పాటలు, రెండు ఫైట్‌లతో పాటు క్యామెడి ఎంటర్‌టైన్‌మెంట్‌గా కొన సాగే చిత్రంగా పేర్కొన్నారు. సినిమా ఆద్యాంత్యం ప్రేక్షకులను రంజింప చేయనుందని డైరెక్టర్ తెలిపారు. తమకు పామూరు మండలంలో షూటింగ్ విషయం చెప్పగానే పూర్తి సహకారం అందిస్తామన్న ఎంపీపీ గంగసాని లక్ష్మీ, మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, చప్పిడి సుబ్బయ్య, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోగా రెండో సినిమా చేస్తున్నట్లు శివప్రసాద్ తెలిపారు. మొదటి సినిమా వార్డుమెంబరు 54లో తాను నటించినట్లు వచ్చే నెలలో రిలీజ్‌కు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. పామూరు మండలంలో సినిమా రంగానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ రాష్ట్ర నాయకులు కొల్లూరు రవికిరణ్ శర్మకు ఈ చిత్రంలో పెద్దరాయుడుపాత్రను పోలే విధంగా సర్పంచ్‌గా ప్రధాన భూమిక పోషిస్తున్నారని అన్నారు. ఈసందర్భంగా జడ్పీటీసీ సుబ్బయ్య, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, మండల బూత్ అధ్యక్షులు విజయ భాస్కర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త జొన్నలగడ్డ గోవిందయ్యలు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పామూరు, బొట్లగూడూరు, బోడవాడ గ్రామాల్లో సినిమాను చిత్రీకరించడం పట్ల చిన్మయి క్రియేషన్స్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సినిమా విజయవంతమై మరిన్ని చిత్రాలు చిన్మయి క్రియేషన్స్ ద్వారా వెనుకబడి ప్రాంతంలో నిర్మితమవ్వాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ షేక్ సలీం, యువనాయకులు చప్పిడి అజయ్, ఎస్సీ సెల్ నాయకులు సూరిపోగు మాల్యాద్రి, వార్డు మెంబరు ఎం80 రసూల్, మదనవేణుగోపాల్‌స్వామి దేవస్థానం చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, గోవిందు కొండారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవుదేవర మహోత్సవానికి దారపనేనిని ఆహ్వానించిన కమిటీ సభ్యులు

**పామూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు గ్రామంలో చెనికల అయితయ్య ధర్మపత్ని సమేతుడై మాలికాడ ఆవుల మందను కాపలా కాస్తుండగా ఒక రోజు ఆవులమందయ్యపై పులిదాడి చేసింది. ఆ దాడిలో పులి అయితయ్య ధర్మపత్ని ఆవు ఆవు దూడచెల్లినారు. ఆ తదనంతరం ఆ ఐదుగురు ఆ ప్రాంతంలోనే 5 అరిమాను చెట్లుగా వెలిసినారు. ఆ రోజు నుంచి మన కోరికలు తీర్చే కొంగుబంగారం కాటమరాజు కొలిసిన కృష్ణ అవతారం బొల్లావు ఆవుదేవర ఇక్కడే వెలిసిందని చరిత్ర చెబుతుంది. గోవర్ధన గిరిదారుడు శ్రీకృష్ణ పరమాత్ముడు శ్రీమతి రాధా సమేతుడై ఆవుల మందతో తూర్పుకోడిగుడ్లపాడు గ్రామ పంచాయతీలోని జంగాలపల్లిలో వెలిశాడని, అలా ఆవుదేవర, రాధాకృష్ణులు కలిసిన పుణ్యక్షేత్రం జంగాలపల్లి దేవస్థానం అని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి పుణ్యక్షేత్రం జంగాలపల్లి దేవస్థానం అని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి పవిత్రమైన, ఎంతో మహోన్నతమైన ఆదివారం జరుగు ఆవుదేవర మహోత్సవానికి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్‌ను ఆహ్వానించడం జరిగిందని తూర్పుకోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల మాలకొండయ్య, చెనికల నాగేశ్వరరావు, మల్లిఖార్జునరావు, కృష్ణ, మనోజ్, సురేష్ తెలిపారు.

## అభయాంజనేయస్వామిని దర్శించుకున్న దారపనేని


**పామూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



గుంటూరు పట్టణంలో వెలసి ఉన్న 79 అడుగుల అభయాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారిని శుక్రవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ బండారు సాంబశివరావు దారపనేని చంద్రశేఖర్‌కు స్వామివారి పట్టువస్త్రం బహుకరిం చారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆంజనేయస్వామి దర్శనం వలన సకల దోషాలు తొలగిపోతాయని స్వామివారిని భక్తులు దర్శించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దారపనేని పేర్కొన్నారు. గుంటూరు మాజీ కార్పొరేటర్ కొంపల్లి మాలకొండయ్య, గుదే నాగేశ్వరరావు, వెలిది మాలకొండయ్య, మానికొండ కొండయ్య, మల్లెల ఏడుకొండలు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

## వైభవంగా వల్లూరమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు

**టంగుటూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



జిల్లాలోనే ప్రసిద్ది చెందిన ఆలయం అయిన మండలం లోని వల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లూరమ్మ ఆలయంలో శుక్రవారం వైభవంగా



వరలక్ష్మీ వ్రతాల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దాతల సహకారంతో వచ్చిన మహిళా భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. సుమారు 1500మంది మహిళా భక్తులు పాల్గొన్నట్లు ఆలయ నిర్వాహణాధికారి బి.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలిమండలి చైర్మన్ కాలే శ్రీనివాసులు, ఈవో బి.రమేష్, ఆలయ ధర్మకర్తలు, ఆలయ పూజా రులు, మహిళా భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తాళ్లూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**

మండలంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9గంటలనుంచి 11వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎస్.వీరబ్రహ్మం తెలిపారు. తాళ్లూరు, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, దారంవారిపాలెం, దోసకాయలపాడు, మాధవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మద్దిశెట్టి శ్రీధర్

**దర్శి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



దర్శిమండలం తూర్పువీరాయపాలెంలో శ్రీనిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి ప్రతిష్ఠ కార్యక్రమంలో యువనాయకులు మద్దిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని దేవుని ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కుమ్మిత అంజిరెడ్డి, వెన్నపూస వెంకటరెడ్డి, కట్టేకోట హరీష్, యాతం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగనగర్ అంగన్‌వాడీ కేంద్రంతోపాటు మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలను కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పలు రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో హాజరు తక్కువగా ఉండటాన్ని గమనించిన మున్సిపల్ చైర్మన్ ఆయా ద్వారా పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్యకర్తకు ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భవతులకు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠవాలలో చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు జగనన్న గోరుముద్ద ద్వారా ఎంతో నాణ్యమైన ఆహారాన్నిఅందించేందుకు చర్యలు తీసుకున్నారని, మెనూ ప్రకారం పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు రుచికరంగా ఆహారాన్ని అందజేయాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ షాహిద్ బేగం, పాఠశాల ఉపాధ్యాయురాలు దీవెన శంషాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలినేనిని మర్యాదపూర్వకంగా కలిసిన దళితనేతలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాదులో ఆయన నివాసంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, రాష్ట్రమహానాడు గౌరవ అధ్యక్షులు బిల్లా చెన్నయ్యలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



## ఉపాధ్యాయులను సన్మానించిన డాక్టర్ కొండలరావు

**చీరాల టౌన్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



వరల్డ్ ఫిజియోథెరపి డే సందర్భంగా స్థానిక చైతన్య మనోవికాస కేంద్రంలో ఫిజియోథెరపి టీచర్స్‌గా పనిచేస్తున్న వారిని ఐకాన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కొండలరావు సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆట బొమ్మలను బహుమతిగా అందజేశారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఫిజియోథెరపి గురించి చేసి చూపించారు. వరల్డ్ ఫిజియోథెరపి డే సందర్భంగా ఇక్కడ ఉన్న విద్యార్థులతో గడపటం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య మనో వికాసకేంద్రం డైరక్టర్ వెంకన్నబాబు, ప్రిన్సిపాల్ మాధురి, ఫిజియోథెరపి ఉపాధ్యాయులు ప్రసన్న,దివ్య పాల్గొన్నారు.

## సీఆర్పీ ప్రధమ చికిత్సపై అవగాహన

**చీరాల, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



చీరాల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా వైఏ మహిళా డిగ్రీ కళాశాలలో గుండెపోటు వచ్చి మనిషి పడిపోయిన యెడల, అంబులెన్స్ వచ్చే లోపల చేయాల్సిన సీఆర్పీ ప్రధమ చికిత్స గురించి విద్యార్థులకు వైద్యులు బాబురావు వివరించారు. వారి చేత చేయించారు. ఈ ఆధునిక జీవితంలో ప్రతి మనిషి, ఆరోగ్యం గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ బాబురావు, ప్రిన్సిపాల్ రమణమ్మ, సౌభాగ్య, లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలింతలకు పౌష్టికాహారం అందజేసిన వార్డు కోఆప్షన్ సభ్యురాలు నాగజ్యోతి

**చీరాల టౌన్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



పౌష్టికాహార మహోత్సవాలలో భాగంగా స్థానిక విటమినగర్ సచివాలయం 25వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం నందు గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మధ్‌వతి, వార్డు కోఆప్షన్ సభ్యులు కోదూరు నాగజ్యోతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని, స్త్రీలు ఈ సమయంలో ఎంతో ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి పౌష్టికాహారం అందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క మహిళ ఉపయోగించుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కే.తిరుమలదేవి, ఆశావర్కర్లు, పి.పద్మ, తులసి, కరీమున్, టి.వనజ కుమారి, ఎం.సుజాత, పి.యేసుదేవి, శివనాగమ్మ, కే.రేవతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**చీరాల, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**

నేడు పందిళ్లపల్లి విద్యుత్ ఉపకేంద్రం మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఉపకేంద్రం పరిధిలోని పందిళ్లపల్లి, కొత్తరెడ్డిపాలెం, రామచంద్రాపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు.

## 12వ వార్డులో పడకేసిన పారిశుధ్యం

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



12వ వార్డు పరిసర ప్రాంతంలో పారిశుధ్యం పడకేసింది. సచివాలయం వెనుకనే అపరిశుభ్రంగా ఉన్నా సచివాలయ సిబ్బంది కన్నెత్తి చూడకపోవడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇళ్లలోని చెత్త మధ్యలో వేస్తూ చెత్తను వేరే చోటికి తరలించకుండా కాల్చి వేయడంతో పొగ వ్యాపించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఖాళీ స్థలంలో చిల్లచెట్లు పెరగడంతో పందులు పెంపకం చేసేవారు ఆహార వ్యర్థాలను వేయడంతో పందులు విపరీతంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తుందని, పలుమార్లు చెప్పినా సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని అన్నారు. ఖాళీ ప్రదేశాల్లో చిల్లచెట్లు పెరిగి పందులు కుక్కలకు ఆవాసాలుగా మారాయి. 12వ సచివాలయం వెనుక నెల రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో ఆ దారిన వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## మార్కాపురం కోఆపరేటీవ్ బ్యాంకును సందర్శించిన చైర్మన్ వైఎం

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



మార్కాపురం కోఆపరేటీవ్ బ్యాంకును జిల్లా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు లావాదేవీలు, రుణాలు తదితర అంశాల గురించి మేనేజర్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఖాతాదారులకు త్వరితగతిన సేవలందించి బ్యాంకుకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

## డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**ఒంగోలు క్రైమ్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టులకు కాంట్రాక్టు పద్దతిలో అర్హత కలిగిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంపిక కాబడిన దరఖాస్తుదారులు సొంత కేసులు గాని, మరీ ఏ ఇతర రిటైనర్ షిప్ తీసుకోవడానికి అనుమతించబడరని తెలియజేశారు. సక్రమంగా పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు స్వీయ దృవీకరణతో సంబంధిత నకళ్ల పత్రాలను చైర్ పర్సన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రకాశం జిల్లాఒంగోలు వారికి 23 తేదీ లోపు సమర్పించాలని తెలియజేశారు. దరఖాస్తులను అభ్యర్థులు స్పీడ్ పోస్టు ద్వారా గాని, వ్యక్తిగతంగా కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సెప్టెంబరు 23వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా దరఖాస్తుదారుల మీద ఎటువంటి క్రిమినల్ కేసులు నమోదు కాబడి ఉండరాదని అన్నారు. గడువు తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఏ.భారతి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## స్నేహహస్తం ఆధ్వర్యంలో సహాయం కోసం ఎదురుచూస్తున్న వ్యక్తికి చేయూత

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



కనిగిరి స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో సహాయం కోసం ఎదురుచూస్తున్న వ్యక్తికి వైద్య సహాయం, వసతిని కల్పించారు. వివరాల్లోకి వెళ్తే.. కనిగిరి శ్రీనివాస థియేటర్లో ఆపరేటర్ పరిసరాలలో నా అన్నవారు ఎవరు లేని శ్రీను గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఇబ్బంది పడుతున్న విషయాన్ని శ్రీనివాస థియేటర్ ఆపరేటర్ వర కుమార్ ఫోన్ ద్వారా స్నేహహస్తంసుధీర్‌బాబుకు సమాచారం అందించడంతో వెంటనే ఆయన స్పందించారు. కనిగిరి ప్రభుత్వవైద్యశాలలో వైద్యం చేయించారు. అనంతరం గిద్దలూరు సంజీవిని ఫ్యూచర్ హెల్పింగ్ చారిటబుల్ వారైనా రాజశేఖర్‌కు సమాచారం ఇచ్చి శ్రీనును గిద్దలూరులోని హోమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి అబ్దుల్ కలాం స్నేహహస్తం సుధీర్‌బాబు సేవలను అభినందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీను వైద్య ఖర్చుల నిమిత్తం శ్రీనివాస థియేటర్ ఆపరేటర్ వరకుమార్ 3వేలు సైతం అందించినట్లు సుధీర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యధికారి అబ్దుల్ కలాం, స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సుధీర్‌బాబు, సంజీవిని ప్యూచర్ హెల్పింగ్ చారిటబుల్ రాజశేఖర్, ప్రజా హక్కుల వేదిక నాయకులు మల్లిఖార్జునరావు, దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు గోన దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు కొండంత అండ వైఎస్సార్ భీమా

### - మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



వైఎస్సార్ భీమా పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని కనిగిరిమున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్ అన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కాశీపురంలో నివసించే సింగంరెడ్డి పెద్ద వెంకటేశ్వర్లు గత కొన్ని రోజులు క్రిందట అనారోగ్య కారణంగా ఉండి మరణించింది. మరణించిన ఆయన వైఎస్సార్ భీమాకు అర్హులైనందున ఆయన నామినిన అయిన లక్ష్మమ్మకి శుక్రవారం కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ చేతుల మీదుగా వైఎస్సార్ భీమా పథకం ద్వారా మంజూరైన రూ.10వేలను మట్టి ఖర్చులు నిమిత్తం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ మిగిలిన క్లైమ్ మొత్తం రూ.90వేలు నామిని ఖాతకు త్వరలో జమ చేయడం జరుగుతుందని అందుకు అవసరమైన పత్రాలను సంబంధిత సచివాలయంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ ఆఫీసర్ వాసుబాబు, మున్సిపల్ సోషల్ మీడియా కన్వీనర్ బండారు తిరుపతిరావు, సచివాలయం కన్వీనర్ దారుకుమల్లి హైమావతి, వైసీపీ నాయకులు కోటిరెడ్డి, మాలకొండారెడ్డి, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యతోనే సుస్థిరాభివృద్ధి: చైర్మన్ అబ్దుల్ గఫూర్

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణ పరిధిలో 11 వార్డులో ఉన్న కాశీరెడ్డి గిరిజన కాలనీలో మండల న్యాయసేవాధికార సంస్థ, ప్రకాశం జిల్లా ఎస్‌బీసీసీ కమిటీ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన న్యాయవాది కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ అక్షరం అనే జ్యోతి జీవితం అనే దీపాన్ని వెలిగిస్తుందన్నారు. జిల్లా ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అక్షరాస్యత ఉన్న వ్యక్తి తదుపరి అభ్యాసం, విద్యను వ్యాప్తి చేయడానికి ఉత్తమ మార్గం అని, ఒక అక్షరాస్యుడు తన పిల్లవాడిని విద్యను అభ్యసించడానికి ఖచ్చితంగా పంపుతాడని అన్నారు.పరివర్తనలో ఉన్న ప్రపంచం కోసం అక్షరాస్యతను ప్రోత్సహించడం, స్థిరమైన, శాంతియుత సమాజాలకు పునాదిని నిర్మించడం అనే అంశంపై ప్రచారం చేయాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందని అన్నారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ ఎస్‌బీసీసీ జిల్లా సభ్యులు గుడ్‌హెల్ప్ రమేష్ బాబు, జీఎస్అండ్‌జీడీకే ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవకుమార్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు అనూష, ఝాన్సీ, చంద్రలీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న రెడ్డికార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



కనిగిరి మండలం తాళ్లూరు కళ్యాణ్ మండపం చింత కొమ్ము వారి వివాహ వేడుకల్లో రాష్ట్ర రెడ్డికార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, తురకపల్లి సర్పంచ్ మారం రవీంద్రారెడ్డి, మురళీ యాదవ్, మూలే గోపాల్‌రెడ్డి, చింతకొమ్ము వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సభ్యులు శీలం శ్రీనివాసులు, శీలం వెంకట నారాయణ నర్సారెడ్డి, రామసత్యం, అమర్నాథ్, శివారెడ్డి, చైతన్యనరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఫణీంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, బొబ్బ కోటిరెడ్డి, గంధం నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీ లక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు

**కనిగిరి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త**



కనిగిరి శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం నందు ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, సహస్ర నామార్చన కుంకుమ పూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు వేద పండితుల ఆశీర్వచనం తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. పూజలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ వారు రవిక, గాజులు, పసుపుకుంకుమలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, ఈర్ల గురవయ్య, ఏసీ చెంచులు, బీసీ రామశాస్త్రి, వాగిచెర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

